క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

యాదమరి: జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించే క్రమంలో సర్వే చేపడుతున్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు ఉమ ఆధ్వర్యంలో సోమవారం చిన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల భవిత ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. పిల్లలను భవిత కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. అక్కడ వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఫిజియో థెరపిస్టు వ్యాయామం వంటివి అందిస్తామని తెలిపారు. పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరజవాన్ తల్లికి బీమా సొమ్ము



చెక్‌ను అందిస్తున్న తపాలాశాఖ అధికారులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామానికి చెందిన వరదరాజుల మండడి, సెల్వి కుమారుడు పంగల కార్తీక్ కుటుంబ సభ్యులకు సోమవారం తపాలా జీవిత బీమా నగదు చెక్కును అందజేసినట్లు చిత్తూరు డివిజినల్ పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. వీరజవాన్ నామినీగా ఉన్న తల్లి సెల్వికి ఇంటి వద్ద రూ.11,50,053 చెక్కును పోస్టల్ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, రిటైర్డు పీఎల్‌ఐ డెవలప్‌మెంట్ అధికారి పురుషోత్తం, రాగిమానుపెంట బ్రాంచ్‌పోస్టు మాస్టర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

మహిళలకు హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ బాబు

బంగారుపాళెం: మహిళలు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిల్ బాబు అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లెలో సోమవారం గ్రామ సమాఖ్య మహిళలకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. సుఖవ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, సీసీ శిరీష, సంఘమిత్ర లీలావతి, క్షేత్రస్థాయి సిబ్బంది లక్ష్మి, కల్పన, వాణి, నందిని పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

చిత్తూరు రూరల్(కాణిపాకం): రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 1న ప్రతి డీలర్‌షాపు తెరుచుకుని పాత పద్ధతిలో రేషన్ పంపిణీ చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఐదు రోజుల్లోపు పంపిణీని పూర్తి చేయాలన్నారు. కార్డుదారులకు ఇబ్బంది పెట్టకుండా సరుకులు ఇవ్వాలని చెప్పారు. ఈ పంపిణీలో సరుకుల కోతలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కరోనా విజృంభిస్తుంటే మహానాడా?

చిత్తూరు కార్పొరేషన్: కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో టీడీపీ మంగళవారం నుంచి గురువారం వరకు కడపలో మహానాడు నిర్వహించడం ఎంతవరకు సబబు అని వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో క్రమేపీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయని చెప్పారు. ఇది కొత్త వేరియంట్ కావడంతో పరిస్థితి క్లిష్టంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతోందన్నారు. ప్రభుత్వం కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మార్గదర్శకాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో లక్షలాది మందిని తరలించి మహానాడు నిర్వహిస్తే కరోనా ఎంతో మందికి చేరే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ప్రాణాలంటే టీడీపీకి లెక్కలేదని విమర్శించారు.

బ్రహ్మోత్సవానికి వేళాయె!

- ఇంద్ర వరదుడి వార్షికోత్సవాలకు నేడు అంకురార్పణ
- నాటి ఇంద్రపురి నేటి యాదమరి
- సాక్షాత్తు ఇంద్రుడు ప్రతిష్ఠించిన దేవతామూర్తి



శ్రీవరదరాజులస్వామి ఆలయం



రథోత్సవం(ఫైల్)

యాదమరి: సాక్షాత్తూ అష్ట దిక్పాలకులకు అధిపతి అయిన ఇంద్రుడు ప్రతిష్ఠించిన శ్రీ పెరుందేవి సమేత శ్రీ వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు అంకురార్పణతో మొదలు కానున్నాయి. మండల కేంద్రంలోని నడిబొడ్డున వరదరాజస్వామిగా వెలసి భక్తులు కోరిన కోర్కెలు తీర్చి అభయ ప్రదాతగా కొలువై ఉన్నారు. బ్రహ్మోత్సవం వేళ ఆలయం నూతన శోభను సంతరించుకుంది. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రముఖ హిందూ దేవాలయాల కన్నా గరుడ సేవ చాలా ప్రత్యేకం. ఆ సమయంలో చాలా అరుదైన కృష్ణ గరుడ పక్షులు ఇక్కడికి విచ్చేసి స్వామి వారిని దర్శించడం ఒక ప్రత్యేకం. ఈ గరుడ పక్షులను దర్శించిన భక్తులకు శ్రీ మహావిష్ణువు సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని పురాణ గాథ. భూ అంతర్భాగంలో ప్రవహిస్తున్న త్రివేణి సంగమం ఒడ్డుపై ఉన్న ఇక్కడి స్వామి వారిని దర్శిస్తే సకల పాపాలూ హరించి..ఇహలోకంలో ఎటువంటి కష్టాలకు చోటు లేక అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలతో తులతూగుతారని ఇక్కడి భక్తుల విశ్వాసం. అందుచేతనే ఏటా ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని తమ కోర్కెలను నెరవేర్చుకుని వెళుతుంటారు.

స్థల పురాణం

పూర్వం కృత యుగంలో దేవతలకు రాజైన దేవేంద్రునిపై జంబాసురుడు అనే రాక్షసుడు యుద్ధం ప్రకటించాడు. మిక్కిలి భయభ్రాంతులకు గురైన ఇంద్రుడు జంబాసురుడిపై గెలుపు కోసం బ్రహ్మదేవుని సూచనల మేరకు మహావిష్ణువు గురించి వెయ్యేళ్ల పాటు ఘోరమైన తపస్సు చేస్తాడు. భూలోకంలో అంజనాద్రి, శోభనాద్రి వద్ద త్రివేణి సంగమం అయినటువంటి గాయత్రి, సావిత్రి, సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తున్న ఒడ్డుపై వటవృక్షం(రావిచెట్టు) కింద క్షేత్రపాలకునిగా ఉన్న ఏకాంబరేశ్వర స్వామి అయిన మహాశివుడు అనుగ్రహంతో శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమవుతాడు. దీంతో స్వామి కరుణా కటాక్షాలతో అసురుడు అయిన జంబాసురునిపై గెలుస్తాడు. అనంతరం భువికి తిరిగి వచ్చి కలియుగంలో భక్తుల సంరక్షణార్థం మహావిష్ణువు యొక్క విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. దీంతో నాటి నుంచి నేటి వరకు స్వామి వారు ఇక్కడి భక్తులను కటాక్షిస్తున్నారు. నాడు ఇంద్రుడు తిరగాడిన ఈ ప్రాంతం ఇంద్రపురిగా ప్రసిద్ధి గాంచి, కాలక్రమంలో నేడు యాదమరిగా స్థిరపడింది. దాదాపు 700 ఏళ్ల ఘనమైన చరిత్ర కలిగిన ఈ దేవాలయం విలువైన స్థిరాస్తులు కలిగి ఉండడం విశేషం.

బ్రహ్మోత్సవం ఇలా..

శ్రీమన్నారాయణుని సేనాపతి, విష్ణు గణాలకు అధిపతి అయిన విష్వక్సేనుడు పురవీధుల్లో విహరించనున్నారు. ఈ నెల 28న ఉదయం 9–10 గంటల మధ్య వేద పారాయణంతో శ్రీ వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనం, 29న హంసవాహనం, 30న యాలివాహనం, 31న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి శేష వాహనం, జూన్ 1న ఉదయం గరుడ వాహనం, రాత్రి కల్పవృక్ష వాహనం, 2న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, 3న సాయంత్రం రథోత్సవం, రాత్రి తోట ఉత్సవం, 4న రాత్రి అశ్వ వాహనం, 5న సాయంత్రం తీర్థవారి, రాత్రి ధ్వజావరోహణం, 6న రాత్రి పుష్పపల్లకి సేవ ఉంటుంది. అనంతరం 7న రాత్రి వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలను ముగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రథోత్సవం.. నభూతో నభవిష్యత్

ఇక్కడి బ్రహ్మోత్సవాల్లో ఏటా నిర్వహించే స్వామి వారి రథోత్సవం చాలా ప్రాచుర్యం పొందింది. తండోపతండాలుగా అశేషమైన భక్తజనులు ఇక్కడికి విచ్చేసి స్వామి వారి సేవలో తరిస్తుంటారు. ఆ సమయంలో ఇంద్రవరదుడి రథాన్ని లాగినా, స్పృశించినా సంతాన లేమితో బాధపడేవారికి సంతాన యోగాన్ని, నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడే వారికి ఉద్యోగం, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడే వారికి ఈతి బాధలు తొలగిపోతాయి. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో వేదన పడేవారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ఉత్సవానికి వేలాదిమంది భక్తులు ఇక్కడికి చేరుకుంటారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రథం లాగు సమయంలో ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

అవి రేచు కుక్కలే!



రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల: రేచు కుక్కలా...చిరుతలా అన్న శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రభాకర్‌రెడ్డి, వందన్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉష, బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట గ్రామాలను సందర్శించారు. రైతుల పొలాల్లో ఉన్న పాదముద్రలను తనిఖీ చేసి రేచు కుక్కలుగా గుర్తించారు. రేచు కుక్కల నియంత్రణకు తగిన సూచనలను వారికి తెలియజేశారు. గ్రామాల్లోకి రాకుండా వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం పుస్తక పఠనం, వేమన పద్యాలు కంఠస్థం చేయించారు. భగవద్గీత శ్లోకాలు పలకించడంతోపాటు నృత్యాలు, ఆట, పాటలు ఆడించి పాడించారు. ఆమె మాట్లాడుతూ సృజనాత్మకతను పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అత్యవసర వసతులపై నిర్లక్ష్యం వద్దు



సమస్యలు వింటున్న ఇన్‌చార్జ్ కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజలకు అందించాల్సిన తాగునీటి, వీధి దీపాలు లాంటి అత్యవసర పవనులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశించారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రోడ్లు, కాలువలు, నీటి సమస్యలపై ప్రజలు వినతులు అందచేశారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నిధులతో కూడుకున్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో ఏసీపీ నాగేంద్ర, డీఈఈ వెంకటరమణ పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ. 2 లక్షల విరాళం



విరాళం ఇస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఓ దాత సోమవారం నగదు విరాళంగా అందించారు. నెల్లూరుకు చెందిన దాత చలపతిరావు గో సంరక్షణకు రూ.2లక్షలు విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ



పనులు పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మేయర్ అముద పర్యవేక్షించారు. ఆమె సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న మురుగునీటి కాలువల్లో పూడిక పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ వర్షాల సీజన్ ప్రారంభం కాకమునుపే కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. నగరంలోని ప్రధాన కాలువలు, కాలనీల్లో చిన్నపాటి వర్షాలకే మురుగు నీళ్లు రోడ్లపైకి వచ్చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా మారుతోందన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మేయర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

చౌక దుకాణాల్లోనే సరుకుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్



హాజరైన వీఆర్‌ఓలు, చౌకదుకాణ డీలర్లు

తవణంపల్లె: చౌకదుకాణాల ద్వారా జూన్ ఒకటో తేదీ నుంచి డీలర్లచే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం చౌకదుకాణ డీలర్ల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్ల సంఘం అభ్యర్థన మేరకు ఎండీఎంల వ్యవస్థను రద్దు చేసి చౌకధరల దుకాణాలను పునరుద్ధరించడానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. డీలర్లు చౌకదుకాణాల వద్ద పెయింటింగ్ వేసి సుందరంగా తయారు నోటీస్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. డీలర్లు కీ రిజిస్టర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రేషన్ దుకాణాల దగ్గర విధిగా నోటీస్ బోర్డులో డీలర్ నంబరుతో పాటు టోల్‌ఫ్రీ నంబరు, తహసీల్దార్, ఎంఆర్‌ఐ, వీఆర్‌ఓ సెల్ నంబర్లు తప్పక ఉంచాలన్నారు. 65 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు, వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ జీవన్‌సాగర్, వీఆర్‌ఓలు, డీలర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాధవరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


గుడిపాల: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని బట్టువాళ్లూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

తవణంపల్లె: గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 25 మందికి వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలని సూచించారు. గర్భవతులు 104, 108 వాహనాల సేవలను, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, రోగులు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి సరిపడా కోరం లేకపోవడంతో వాయిదా వేశామన్నారు. ఎంపీపీ సూచనల మేరకు త్వరలో సర్వసభ్య సమావేశం తేదీని నిర్ణయిస్తామని అన్నారు. సర్వసభ్య సమావేశం ప్రారంభానికి ముందు అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్ వెనుక పసుపు రంగు వస్త్రం ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి హితవు పలికారు. ఇది టీడీపీ మీటింగ్ కాదు ప్రజాప్రతినిధుల సర్వసభ్య సమావేశమని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాలని చెప్పారు. చెడు సంస్కృతికి అధికారులు దూరంగా ఉండాలని సూచించారు.



నేడు గంగజాతర

ఐరాల మండల కేంద్రంలో వెలిసిన గ్రామదేవత శ్రీ పాలేటమ్మ గంగ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర ధర్మకర్త బాలాజి తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి తెర తీసి ప్రత్యేక పూజలు నిర్వహించి అంబళ్లు, మధ్యాహ్నం పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల నడుమ నిమజ్జనానికి తరలించనున్నట్లు వివరించారు. జాతరను పురస్కరించుకుని బజారువీధి, వీఎస్.అగ్రహారంలో విద్యుత్ దీపాలతో అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

- ఐరాల